సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం, 3, ఆగస్టు, 2023



గంజాయి స్వాధీనం
వ్యాన్‌లో తరలిస్తున్న 180 కిలోల గంజాయిని పెదబయలు మండలం సీతగుంట జంక్షన్‌లో పోలీసులు పట్టుకున్నారు. 8లో



విస్తృతంగా ప్లాంటేషన్
రాజవొమ్మంగి అటవీక్షేత్రంలో 25 హెక్టార్లలో ప్లాంటేషన్ పనులు చేపట్టాలని డీఎఫ్‌వో నరేంధిరన్ ఆదేశించారు. 8లో



'ముసురుమిల్లి' నీరు విడుదల
ముసురుమిల్లి కెనాల్ ద్వారా ఖరీఫ్ ఆయకట్టుకు సాగునీరును ఎంపీపీ కుంజం మురళి విడుదల చేశారు. 8లో

న్యూస్‌రీల్

లక్ష్యం ప్రతిబింబించేలా..



వైఎస్సార్ సంపూర్ణ పోషణ సరకులతో ఏర్పాటుచేసిన స్టాల్

ముంచంగిపుట్టు : స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ సరకులతో ఏర్పాటు చేసిన నమూనా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ పంపిణీలో భాగంగా ప్రభుత్వ లక్ష్యం ప్రతిబింబించేలా ఈ నమూనాను రూపొందించారు.

ఎన్నికల రిటర్నింగ్ అధికారుల నియామకం

సీతంపేట (విశాఖ): రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలకు ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్లను నియమిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదలయ్యింది. అరుకులోయకు పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్, పాడేరుకు అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్, రంపచోడవరానికి రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్ (రంపచోడవరం)లను నియమించారు.

బాధితులకు టార్పాలిన్ల పంపిణీ



వరద బాధితులకు టార్పాలిన్లు అందచేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పీవో సూరజ్ గనోరే

కూనవరం: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో టార్పాలిన్లు, దోమతెరలను వరద బాధితులకు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే పంపిణీ చేశారు. బుధవారం మండలంలోని కోతులగుట్ట పునరావాస కేంద్రం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. పునరావాస కేంద్రంలో ఉంటున్న వరద బాధితులకు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గుజ్జా విజయ, సొసైటీ కోఆర్డినేటర్ లోహితాస్, కోటేశ్వరరావు, భాస్కరాచారి, కృపాకర్, సీతారాం పాల్గొన్నారు.

ఓపెన్ యూనివర్సిటీ అడ్మిషన్ల గడువు పొడిగింపు

పాడేరు రూరల్ : పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2023-24 విద్యా సంవత్సరానికి ప్రవేశాల గడువును ఈనెల 16 వరకు పొడిగించినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వనుము చిట్టిబ్బాయ్ తెలిపారు. ఇప్పటికే బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైందని ఆయన పేర్కొన్నారు. ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిప్లమో, ఓపెన్ ఇంటర్ పాసైన విద్యార్థులు డిగ్రీ ప్రవేశాలకు అర్హులన్నారు. తృతీయ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులతో పాటు 2017 నుంచి 2022 బ్యాచ్‌లలో అడ్మిషన్ పొందిన విద్యార్థులు ట్యూషన్ ఫీజు, ల్యాబ్ ఫీజు చెల్లించేందుకు కూడా ఈనెల 16వరకు గడువు ఉందన్నారు. పూర్తి వివరాలకు 9490458695, 7382929728, 9494372020 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

లారీ తొలగింపు.. ట్రాఫిక్‌కు అంతరాయం



లారీని బయటకు తీస్తున్న క్రేన్లు

అనంతగిరి: ఘాట్‌రోడ్డులోని ఒకటో నంబర్ హెయిర్‌పిన్‌బెండ్ సమీపంలోని మలుపు వద్ద సోమవారం ఉదయం తవుడు లోడుతో వెళుతున్న లారీ అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయింది. లారీని బయటకు తీసేందుకు బుధవారం చర్యలు చేపట్టారు. రెండు భారీ క్రేన్లను మైదాన ప్రాంతాలను నుంచి తీసుకువచ్చి, ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రమించడంతో లారీని ఎట్టకేలకు బయటకు తీశారు. పెద్ద ఎత్తున ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. సుమారు రెండు గంటలపాటుగా కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానిక పోలీసులు పరిస్థితులకు తగ్గట్టుగా ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

జీడిమామిడి C/O పందిరిమామిడి

జీడిమామిడి అంటుమొక్కల ఉత్పత్తిలో పందిరిమామిడి వైఎస్సార్ ఉద్యానవన పరిశోధన స్థానంలో మేటిగా నిలుస్తోంది. ఇక్కడి నుంచి ఏటా ఆంధ్రాతోపాటు ఒడిశా, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన సుమారు లక్ష మొక్కలను రైతులు కొనుగోలు చేసి తీసుకువెళ్తున్నారు. మెరుగైన దిగుబడితోపాటు పిక్క సైజు, రంగు బాగున్నందున రైతులు మార్కెట్లో మంచి ధర పొందుతూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు.



జీడిమామిడి అంటుమొక్కల ప్రయోజనాలపై రైతులు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రాజేంద్రప్రసాద్

- సాగును ప్రోత్సహిస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన పరిశోధన స్థానం
- ఏటా లక్ష అంటుమొక్కల ఉత్పత్తి
- ఆంధ్రాతోపాటు ఒడిశా, తెలంగాణ రాష్ట్రాలకు సరఫరా
- నాణ్యమైన పిక్క, మెరుగైన దిగుబడి
- నాటిన రెండో ఏడాది నుంచి ఫలసాయం

రంపచోడవరం: మూడు రాష్ట్రాల్లో జీడిమామిడి సాగును ప్రోత్సహించడంలో పందిరిమామిడి డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన పరిశోధన స్థానం కీలకపాత్ర పోషిస్తోంది. జిల్లాతోపాటు ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో మెట్ట రైతులకు జీడిమామిడి సాగు ప్రధాన ఆధారం. వీరంతా ఇక్కడి నుంచి మేలు రకం అంటుమొక్కలను తీసుకువెళ్తుంటారు. ఈ ఉద్యానవన పరిశోధనా స్థానం 1986లో ఏర్పాటైంది. ఇక్కడ పలు రకాల ఉద్యానవన పంటలపై పరిశోధనలు జరుగుతున్నాయి. వీటిలో ప్రధానంగా ఏజెన్సీకి అనువైన అంటుమొక్కలు లభ్యమవుతున్నాయి. ఇక్కడ పరిశోధనల అనంతరం వాటిని ఉత్పత్తిచేసి రైతులకు సరఫరా చేస్తున్నారు.

అవగాహన కల్పిస్తూ..
సాధారణంగా రైతుల అవగాహన లేనందున పిక్క మొక్కలు నాటుతుంటారు. ఇవి కాపునకు వచ్చేసరికి చాలా సమయం పడుతుంది. దీనివల్ల ఎదురయ్యే సమస్యను పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు రైతు చైతన్య యాత్రల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. గత 13 ఏళ్లుగా రైతులకు జీడిమామిడి అంటుమొక్కలను శాస్త్రవేత్తలు సరఫరా చేస్తున్నారు. తొలుత ఏడాదికి పదివేల మొక్కలతో ప్రారంభమైన ఉత్పత్తి లక్ష మొక్కలకు చేరుకుంది. మెట్ట ప్రాంతంతోపాటు ఏజెన్సీకి అనువైన రకాలను సరఫరా చేయడం వల్ల ఇక్కడి మొక్కలకు మంచి డిమాండ్ ఉంది. ఒడిశా, తెలంగాణతోపాటు చత్తీస్‌గఢ్ నుంచి కూడా తీసుకువెళ్తున్నారు.

అనువైన రకాలివే..
కోస్తాతోపాటు ఏజెన్సీ ప్రాంతానికి అనువైనవిగా బీపీపీ-5, బీపీపీ-8, బీపీపీ-11 రకాలను సరఫరా చేస్తున్నారు. వీటి తల్లి మొక్కలను పరిశోధన స్థానంలో పెంచుతున్నారు. వాటి నుంచి అంటు మొక్కలను ఉత్పత్తి చేస్తున్నారు. మొక్కల ఉత్పత్తిలో ఈ ఉద్యానవన పరిశోధన కేంద్రం 2021కు గాను 'బి' కేటగిరీలో మొదటి ర్యాంక్ సాధించింది.

ధరల వివరాలిలా.. : జీడిమామిడి అంటుమొక్క రూ.50, మామిడి రూ.60, వాక రూ.15, జాఫ్రా రూ.15, నిమ్మ రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు. నెల్లూరు వద్ద పేట్లూరు హెచ్‌ఆర్‌ఎస్‌లో అభివృద్ధి చేసిన నిమ్మరకాల నుంచి ఇక్కడ అంటు మొక్కలను ఉత్పత్తి చేస్తున్నారు. ఇవి అన్ని రకాల వాతావరణ పరిస్థితులను తట్టుకుంటాయని శాస్త్రవేత్తలు తెలిపారు.

సిద్ధంగా అంటుమొక్కలు



ప్రస్తుతం పరిశోధనా స్థానంలో జీడిమామిడికి సంబంధించి బీపీపీ-8, బీపీపీ-9, బీపీపీ-5, మామిడి, నిమ్మ (పెట్లూర్ రకం), జీవ కంచెగా వాక, జాఫ్రా మొక్కలు అందుబాటులో అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. కావలసిన రైతులు 9491688487, 7382633663, 08864-243577 నంబర్లలో సంప్రదించాలి.
– డాక్టర్ కొప్పిశెట్టి రాజేంద్ర ప్రసాద్, ఉద్యానవన పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త, ఉద్యాన విభాగం అధిపతి, పందిరిమామిడి

వాట్సాప్‌లో సూచనలు

పరిశోధన స్థానం శాస్త్రవేత్త రాజేంద్రప్రసాద్ జీడిమామిడి రైతులకు వాట్సాప్ గ్రూప్ ఏర్పాటుసి సూచనలు, సలహాలు అందిస్తున్నారు. అత్యవసర సమయంలో ఫోన్ ద్వారా కూడా సూచనలు పొందగలుగుతున్నాం.
– ఆర్ వెంకటేంద్ర, రైతు, కనుపూరు, కోరుకొండ

నర్సరీలో కొని నష్టపోయా

మొదటిసారి ప్రైవేట్ నర్సరీని తీసుకువచ్చి నాటాం. వీటిలో చాలా వరకు చనిపోయాయి. తరువాత ఐదు వందలు జీడిమామిడి అంట్లు పందిరి మామిడి ఉద్యాన పరిశోధన స్థానం నుంచి తెచ్చి నాటగా 90 శాతానికి పైగా బతికాయి. మంచి దిగుబడి వస్తోంది. పిక్క సైజు, రంగు బాగుంది.
– సత్యనారాయణ, రైతు, నూజివీడు, కృష్ణాజిల్లా

రెండో ఏడాది నుంచి కాపు

అధ్యాపకునిగా రిటైర్ అయ్యా. మొక్కల పెంపకంపై ఆసక్తితో 200 జీడిమామిడి మొక్కలను పందిరి మామిడి ఉద్యాన పరిశోధనం నుంచి 2020లో తీసుకువచ్చి నాటా. రెండో సంవత్సరం నుంచి దిగుబడి మొదలైంది. పిక్క సైజు పెద్దగా ఉంది. గుత్తులుగా కాస్తున్నాయి.
– జి.త్రినాథ్, దొంతమూరు, తూర్పుగోదావరి జిల్లా

సీఎం జగన్ పర్యటన రేపు

- కూనవరం మండలంలో వరద ప్రభావిత ప్రాంతాల సందర్శన
- షెడ్యూల్ ఖరారు



చింతూరు/కూనవరం: గోదావరి వరద ముంపునకు గురైన కూనవరం మండలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం పర్యటించనున్నారు. ఈమేరకు షెడ్యూల్ ఖరారైంది.

- ఉదయం 10.20కు కూనవరం మండలం కోతులగుట్టలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 10.20 నుంచి 10.30 వరకు వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టిన సహాయక చర్యలపై హెలిప్యాడ్ వద్ద అధికారులను అడిగి తెలుసుకుంటారు. అనంతరం స్థానిక ప్రజా ప్రతినిధులతో మాట్లాడతారు.
- 10.35కు కోతులగుట్ట నుంచి బయలుదేరి 10.50కు కూనవరం బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభాస్థలికి చేరుకుంటారు.
- ఉదయం10.50 నుంచి మధ్యాహ్నం 12.20 వరకు కూనవరం, వీఆర్‌పురం మండలాలకు చెందిన వరద బాధితులతో ఆయన మాట్లాడతారు.
- 12.20కు కూనవరంలో బయలుదేరి 12.35కు తిరిగి కోతులగుట్టలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకుని 12.40కు తాడేపల్లి బయలుదేరుతారు.

హెలిప్యాడ్ ఏర్పాటుకు స్థల పరిశీలన
కూనవరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం పర్యటించనున్న నేపథ్యంలో కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం మండలంలోని కోతులగుట్టలో హెలిప్యాడ్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. వరద బాధితులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడేందుకు స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలోని స్థలాన్ని కూడా ఆయన పరిశీలించారు. చింతూరు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభంబన్సాల్, ఎస్టీ కమిషన్ సభ్యులు చిచ్చడి మురళి, తహసీల్దార్ కె.అనసూయ, ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జావిజయ తదితరులు పాల్గొన్నారు.



కోతులగుట్టలో హెలిప్యాడ్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

గిరిజన విద్యార్థులకు కంటి పరీక్షలు

అంధత్వ నివారణ సంస్థ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ విశ్వేశ్వరనాయుడు

పాడేరు రూరల్ : జిల్లా పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి లోపాలను గుర్తిస్తున్నామని అంధత్వ నివారణ సంస్థ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ విశ్వేశ్వరనాయుడు తెలిపారు. బుధవారం పాడేరు పట్టణంలోని తలార్‌సింగి, లోచలిపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో కంటి వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తలార్‌సింగి ఆశ్రమ పాఠశాలలో 46 మంది విద్యార్థులకు లోచలిపుట్టులో 29 మంది విద్యార్థులకు కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఇప్పటి వరకు 25,131 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. వీరిలో 1311 మంది విద్యార్థులు దృష్టి లోపంతో బాధపడుతున్నట్లు నిర్ధారించామని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు కంటి కలకల వ్యాధి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కంటి సంరక్షణపై అవగాహన కల్పించారు.



తలార్‌సింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న విశ్వేశ్వరనాయుడు

గంజాయి నిర్మూలనే లక్ష్యం

- ప్రత్యామ్నాయ పంటల సాగుకు చర్యలు
- డ్వామా పీడీ రమేష్‌రామన్

డుంబ్రిగుడ: గంజాయి నిర్మూలనే లక్ష్యంగా ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని డ్వామా పీడీ రమేష్‌రామన్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గంజాయి పండించిన పంట పొలాల్లో ఇప్పుడు ఉద్యాన పంటలతో కళకళలాడుతుందన్నారు. ప్రతి ఒక్కరు మొక్కల నాటుకునేల రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.ప్రత్యామ్నాయ పంటలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన అన్నారు. రైతులకు సుస్థిర ఆదాయం వచ్చేలా ప్రభుత్వం పోత్సహిస్తోందని పేర్కొన్నారు. గ్రామాల్లో ఉపాధి పనుల ద్వారా ప్రతి ఒక్కరు పండ్ల తోటలను పెంచుకునేలా రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధి సిబ్బందిపై ఉందన్నారు.జాబ్ కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి ఉపాధి పనులు కల్పించాలని ఆయన ఆదేశించారు. ఎంపీడీవో ఉషారాణి, ఏపీవో దొర్రబాబు పాల్గొన్నారు.



మొక్కలను పరిశీలిస్తున్న పీడీ రమేష్ రామన్

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

జిల్లా మలేరియా అధికారి ప్రసాద్

చింతూరు: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా తగిన పారిశుధ్య పనులు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి ప్రసాద్ ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ సిబ్బంది, వైద్యసిబ్బందితో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఫ్రైడే-డ్రైడేను విధిగా నిర్వహించాలని, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. గ్రామ పంచాయతీ స్థాయిలో యాంటీ లార్వా ఆపరేషన్‌లో భాగంగా స్ప్రేయింగ్, ఫాగింగ్, శానిటేషన్ కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించాలని కోరరాఉ. వివిధ శాఖల సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించడం ద్వారా ప్రజలను వ్యాధుల బారినుంచి కాపాడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, ఎంపీడీవో వెంకటరత్నం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంవో ప్రసాద్

బోధనలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

డీఈవో సలీంబాషా

డుంబ్రిగుడ: విద్యాబోధనలో నిర్లక్ష్యంగా వ్యవహరించే ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని డీఈవో సలీంబాషా హెచ్చరించారు. బుధవారం ఆయన మండలంలోని పరిడి ఎంపీయూపీ పాఠశాల, కస్తూర్బా విద్యాలయాన్ని తనిఖీ చేశారు. విద్యార్థుల చదవు సామర్థ్యాన్ని పరిశీలించారు. నోట్ పుస్తకాలు సక్రమంగా లేకపోవడాన్ని ఆయన గుర్తించారు. ఉపాధ్యాయులు నిర్లక్ష్యాన్ని విడనాడి పనిచేయాలని సూచించారు. రికార్డులు, స్టాక్ రూమ్‌ను పరిశీలించారు. సక్రమంగా మెనూ అమలు చేయాలని లేకుంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.



డుంబ్రిగుడ కేజీబీవీ పాఠశాలలో విద్యార్థుల వర్క్ పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈవో సలీంబాషా

ఏజెన్సీలో విస్తారంగా వర్షాలు

- ఉధృతంగా కొండ వాగులు, గెడ్డలు
- పలుచోట్ల రాకపోకలకు అంతరాయం



పారాధానిపుట్టు వద్ద ఉప్పొంగి ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ



వరద ఉధృతికి ధ్వంసమైన బొక్కెళ్లు సమీపంలోని సీసీరోడ్డు

సాక్షి, పాడేరు: ఏజెన్సీలోని విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ప్రధాన గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జి.మాడుగుల-పాడేరు, హుకుంపేట, ముంచంగిపుట్టు, పెదబయల్ మండలాల్లో విస్తరించి ఉన్న మత్స్యగెడ్డలో వరదనీరు భారీగా చేరుతుండటంతో ఉప్పొంగి ప్రవహిస్తోంది. పాడేరు మండలం బొక్కెళ్లు, పెదబయలు మండలంలో పారాదానిపుట్టు కాజ్‌వేపై నుంచి మత్స్యగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బొక్కెళ్ల సమీపంలో గెడ్డ ప్రవాహంతో సీసీరోడ్డు ధ్వంసమైంది. ఏజెన్సీలోని వర్షాలు కురుస్తుండడంతో రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమైంది.



బొక్కెళ్లు సమీపంలోని కాజ్‌వేపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ

జి.మాడుగులలో అత్యధికంగా..
సాక్షి,పాడేరు: జిల్లాలోని అత్యధికంగా జి.మాడుగుల 38.4 మిల్లీమీటర్లు, అత్యల్పంగా వీఆర్‌పురం 2.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ముంచంగిపుట్టులో 36.4, గూడెంకొత్తవీధిలో 22.4, పెదబయలులో 15.8, చింతపల్లిలో 14.2, అరకులోయలో 12.2, డుంబ్రిగుడలో 9.2, హుకుంపేటలో 7.6, కొయ్యూరులో 8, అనంతగిరిలో 3.6, పాడేరులో 3, వై.రామవరంలో 12.4, మారేడుమిల్లిలో 9.8, రంపచోడవరంలో 10, అడ్డతీగలలో 8.6, రాజవొమ్మంగిలో 2.6, చింతూరులో 8.2ఎంఎం వర్షపాతం నమోదైంది.

80.96 శాతం మేర పింఛన్ల పంపిణీ



వడ్డేగూడెం పంచాయతీలో పింఛను పంపిణీ చేస్తున్న గ్రామ వలంటీర్

సాక్షి,పాడేరు: జిల్లాలో పింఛన్ల పంపిణీ విజయవంతంగా సాగుతోంది. బుధవారం సాయంత్రానికి 80.96 శాతం మేర పంపిణీ పూర్తయింది. 22 మండలాల పరిధిలో 99, 398 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. వరద సమస్యను ఎదుర్కొన్న చింతూరు డివిజన్ పరిధిలో ఎటపాక, వీఆర్.పురం, కూనవరం, చింతూరు మండలాల్లో కూడా 80 శాతం మేర పింఛన్ల పంపిణీ పూర్తయింది.

గిరిజనుడి అదృశ్యంపై ఫిర్యాదు



రామారావు

గూడెంకొత్తవీధి: గిరిజనుడి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు అందింది. మండలంలోని పాత వీధి గ్రామానికి చెందిన గబులంగి రామారావు (55) కుమార్తె దుర్గా భవాని ఒంగోలులో ఉంటోంది. ఆమెను ఇక్కడి నుంచి గత నెల 22వ తేదీన తీసుకుని రామారావు ఒంగోలు వెళ్లాడు. అక్కడ కుమార్తె ఇంటి దగ్గర రెండు రోజులు ఉన్నాడు. అనంతరం ఈనెల 24న తిరుగు పయనమైన రామారావు ఇంటికి రాలేదు. అప్పటినుంచి బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ప్రయోజనం కనిపించలేదు. దీంతో కుమార్తె దుర్గా భవానీ ఒంగోలు పోలీసుస్టేషన్‌లో, భార్య గబులంగి జోగులమ్మ, కుమారుడు భాను గూడెంకొత్తవీధి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిస్తే 9492831030, 8309879032 నంబర్లకు తెలియజేయాలని వారు కోరుతున్నారు.



వరద తాకిడికి కోతకు గురైన జాతీయ రహదారి



జేసీబీ సాయంతో మరమ్మతులు



రాకపోకలకు సిద్ధమైన రహదారి

శరవేగంగా..

వరద ప్రభావిత ప్రాంతాల్లో దెబ్బతిన్న రహదారులకు అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరిస్తున్నారు. కోతకు గురైన ఆంధ్రా-ఒడిశా జాతీయరహదారి-326కు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి రహదారిని పునరుద్ధరించారు.
– చింతూరు

క్లుప్తంగా

బీకాం కోర్సు కొనసాగించేందుకు కృషి

కొయ్యూరు: మర్రిపాలెం మహిళా డిగ్రీ కళాశాలలో ఈ ఏడాది బీకాం కోర్సును కొనసాగించేలా కృషి చేస్తామని ఎంపీ మాధవి, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తెలిపారు. వసతి చాలని కారణంగా ఈ కోర్సును నిలిపివేయాలని విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు నిలిపివేశామని కళాశాల ప్రిన్సిపాల్ షేక్ హరూన్ తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ, ఎమ్మెల్యేలు విద్యాశాఖ కమిషనర్‌తో మాట్లాడి కోర్సు కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కౌలు రైతులకు సాగుహక్కు పత్రాలు

ముంచంగిపుట్టు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ, రెవెన్యూ, ఉద్యాన అధికారులు, సహాయకులతో ఏవో శ్రీనివాసబాబు బుధవారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కౌలు రైతులను గుర్తించి పంట సాగు హక్కు పత్రాలు అందజేస్తున్నట్టు చెప్పారు. కనీసం 2.5 ఎకరాల పంట భూమి గల రైతుల నుంచి సాగు నిమిత్తం కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న రైతులను గుర్తించనున్నామన్నారు. ఈ హక్కు పత్రం పొందిన కౌలు రైతు 11 నెలలు కాలంలో ఉపయోగంలో ఉంటుందని, ఈ పత్రం పొందేందుకు భూమి పట్టాదారు పాసు పుస్తకాం జెరాక్స్, సర్వే నంబర్ల వివరాలను తెలియజేయాలన్నారు. భూమి హక్కుదారుడి ఆధార్ జెరాక్స్, ఒక పాసు పోర్టు సైజ్ ఫోటో, కౌలు రైతు ఆధార్ కార్డు జెరాక్స్‌ను దరఖాస్తు చేయాలని సూచించారు. పత్రాలను పరిశీలించి పంట సాగు హక్కు పత్రం అందిస్తామన్నారు.

తెగుళ్ల నివారణకు సూచనలు


కషాయం తయారీని వివరిస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: కొమరాపురం గ్రామంలో మండల రిసోర్స్ పర్సన్ అప్పలరాజు బుధవారం పర్యటించి, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. పంటలకు సోకే అగ్గితెగులు, పాడ తెగులు, దోమ పోటు నివారణకు గుడ్లు, బెల్లం, నిమ్మకాయలతో కషాయం తయారీని వివరించారు. ఈ ద్రావణాన్ని పంటపై పిచికారీ చేయడంతో తెగుళ్ల నివారణతో పాటు అధిక దిగుబడి సాధించవచ్చన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



హుకుంపేట, రంపచోడవరంలలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను అందజేస్తున్న అరకు, రంపచోడవరం ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మి

హుకుంపేట: గర్భిణిలు, బాలింతలు,చిన్నారులు ఆరోగ్యవంతులుగా ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని, ఈ మేరకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను అందజేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం జరిగిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం నాణ్యమైన పౌష్టిక ఆహారం అందిస్తుందన్నారు. గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత సమస్య లేకుండా ప్రభుత్వం ఆయా సరకులను పంపిణీ చేస్తోందన్నారు. మాతా శిశు మరణాలు లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు.

ఎంపిపి కూడా రాజుబాబు, జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం, ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి, ఎంపీడీవో వెంకటరావు, సీడీపీవో బాలచంద్రమణిదేవి, ఏపీఎం చిన్నారావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు, పార్టీ యువజన విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి నైని సత్తిబాబు, ఎంపిటీసీ రమ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

రంపచోడవరం: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపం లేకుండా ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, ఈ మేరకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను అందజేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వం సరఫరా చేసిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ సరకులను గర్భిణులు, బాలింతలకు ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందన్నారు. ఏజెన్సీలో మాతా శిశు మరణాలు అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక పోషకాహారం అందిస్తోందన్నారు. ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, సర్పంచ్ మంగా బొజ్జయ్య , సొసైటీ అధ్యక్షుడు జల్లేపల్లి రామన్నదొర, ఎంపీటీసీ సభ్యులు ఉలవల లక్ష్మి, వంశీ కుంజం, మండల సచివాలయ కన్వీనర్ రామకృష్ణదొర, ఏపీవో శ్రీనివాస్, సీడీపీవో సంధ్యారాణి, సర్పంచ్ రమేష్‌బాబుదొర, నాయకులు రత్నరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సూచనలు చేశారు. ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, వైస్‌ఎంపీపీ కరణం వీరవెంకట రమణ, సీడీపీవో దీప్తి, ఎంపీటీసీ సభ్యులు నక్కా ఈశ్వరి, వడ్లమూరి రత్నం, కో-ఆప్షన్ సభ్యుడు షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న ట్రాలర్

ఆటో డ్రైవర్ మృతి


మృతుడు నారాయణరాజు (ఫైల్)

హుకుంపేట: మండల కేంద్రానికి సమీపం లోని గరుగుపల్లి,తాడేపుట్టు జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఆటో డ్రైవర్ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తాడిపుట్టు పంచాయతీ ఉర్రాడ నిమ్మలపాడు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ రేంగ నారాయణరాజు(35) పనులు ముగించుకుని మంగళవారం రాత్రి తన గ్రామానికి ఆటోలో బయలుదేరాడు. ఈ సమయంలో పాడేరు-అరుకు ప్రధాన రహదారిలో తాడిపుట్టు, గడుగుపల్లి జంక్షన్ వద్ద కొట్నాపల్లి గ్రామం నుంచి జేసీబీని తీసుకొస్తున్న ట్రాలర్ అదుపుతప్పి ఆటోను బలంగా ఢీకొని సుమారు 30 మీటర్ల వరకు ఈడ్చుకుని వెళ్లింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ నారాయణరాజు రోడ్డుపై పడడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

ఆటోను ఢీకొన్న అనంతరం ట్రాలర్ నూతనంగా నిర్మిస్తున్న వంతెన గోడను ఢీకొని బోల్తాపడింది. ట్రాలర్, జేసీబీ పూర్తిగా ధ్వంసమయ్యాయి. ట్రాలర్ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడి, పరారయ్యాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సతీష్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. అప్పటికే ఆటో డ్రైవర్ కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని తమకు న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని తరలించబోనివ్వమని భీష్మించుకు కూర్చుకున్నారు. హైవే అధికారులు,మృతుడి కుటుంబ సభ్యుల మధ్య బుధవారం జరిగిన చర్చలు ఫలించడంతో మృతదేహాన్ని పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియలు జరిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, నలుగురు చిన్నపిల్లలు ఉన్నారు. కుటుంబ యజమాని మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.


ప్రమాదానికి గురైన ట్రాలర్

వైద్యుల పోస్టులకు 7న ఇంటర్వ్యూ

మహారాణిపేట: ఆంధ్ర వైద్య కళాశాల పరిధిలో పలు సీనియర్ రెసిడెంట్స్ వైద్యుల పోస్టుల భర్తీకి గాను ఈనెల 7న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. ఆంధ్ర వైద్య కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు అభ్యర్థులు నేరుగా హాజరుకావచ్చన్నారు. వివరాలకు https@//www. amc.edu.in వెబ్‌సైట్‌లో చూడవచ్చన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 9848314843 నెంబరుకు సంప్రదించవచ్చని తెలిపారు.



విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన

అడ్డతీగల: అడ్డతీగల సబ్‌డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల వ్యాప్తంగా విస్తృతంగా వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు అడ్డతీగల సహాయ వ్యవసాయ సంచాలకులు కె.సావిత్రి తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి రైతుభరోసా కేంద్రం పరిధిలోనూ రైతులను సమావేశపరిచి వివిధ అంశాలను వివరిస్తున్నామన్నారు. భూసార పరీక్షల ప్రాధాన్యత, విత్తన శుద్ధి ఉపయోగాలు, సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. వరి సాగు పద్ధతులను తెలియజేస్తున్నామన్నారు. కాంప్లెక్స్ ఎరువులు పంట ఎదుగుదల మధ్యలో వాడకూడదని సూచిస్తున్నామన్నారు.రైతులకు జీవ శిలీంద్రనాసిని, సూడోమోనాస్ ఫ్లోరెస్సేని రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు.


వెంకటనగరంలో విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సహాయకుడు శ్రీను

అటవీ క్షేత్రాల్లో విస్తృతంగా ప్లాంటేషన్

- 25 హెక్టార్లలో మొక్కల పెంపకం
- రంపచోడవరం డీఎఫ్ఓ జి.జి.నరేంధిరన్


విలేకరులతో మాట్లాడుతున్న రంపచోడవరం డీఎఫ్‌వో నరేంధిరన్

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి అటవీక్షేత్రంలో 25 హెక్టార్లలో ఏఎన్ఆర్ ప్లాంటేషన్ పనులు చేపట్టాలని స్థానిక అటవీ అధికారులకు రంపచోడవరం డీఎఫ్ఓ జి.జి.నరేంధిరన్ లక్ష్యం నిర్దేశించారు. ఆయన బుధవారం రాజవొమ్మంగి రేంజ్‌లో ప్లాంటేషన్ పనులకు భూమిని పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అడవిలో సహజసిద్ధంగా పెరిగే విలువైన చెట్లను కాపాడేందుకు చర్యలు తీసకొంటున్నామన్నారు. ఇందులో భాగంగా ఏఎన్ఆర్ (అసిస్టెడ్ నాచురల్ రీజనరేషన్) ప్లాంటేషన్‌లో భాగంగా ఈ ప్రాంత అడవుల్లో సహజ సిద్ధంగా, త్వరగా పెరిగే బిల్లుడు (బిళ్ళచెట్లు) వంటి విలువైన వృక్షజాతులను కాపాడటమే ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. ఈ మేరకు 25 హెక్టార్లలో ఏఎన్ఆర్ ప్లాంటేషన్‌కు చర్యలు చేపడుతున్నామన్నారు. ఎంపిక చేసిన ప్రదేశాల్లో పిచ్చిమొక్కలు తొలగించి, టేకు, వేగిస, రోజ్ వుడ్, సోమిత, నేరేడు మొక్కలను పెంచాలని సిబ్బందికి సూచించారు. ఈ మేరకు ఎస్టిమేషన్లు రూపొందించి వెంటనే నివేదించాలన్నారు. మరో 15 హెక్టార్లలో ఏఆర్ (ఆర్టిఫీషియల్ రీ జనరేషన్) ప్లాంటేషన్‌లో భాగంగా టేకుమొక్కలను నాటాలని సూచించారు. కొండపోడు వ్యవసాయం చేపడుతున్న రైతులు అటవీ ప్రాంతంలోని విలువైన వృక్షాలను మట్టుపెట్టవద్దన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఫిబ్రవరి నెల తరువాత తన పరిధిలోని అన్యాక్రాంతమైన 70 హెక్టార్ల అటవీభూమిని తిరిగి స్వాధీనపరచుకొన్నామన్నారు. రంపచోడవరం డివిజన్‌లో మొత్తం 10 బేస్ క్యాంపులు ఉండగా 50 మంది సిబ్బంది పనితీరు బాగుందన్నారు. ఇటీవల వై.రామవరంలో అక్రమంగా అటవీ సంపద ధ్వంసాన్ని అడ్డుకొని, మోటార్‌బైక్‌ను బేస్ క్యాంపు సిబ్బంది సీజ్ చేశారని గుర్తు చేశారు. స్థానిక అటవీ క్షేత్రాధికారి అబ్బాయిదొర, ఎఫ్ఎస్ఓలు, ఎఫ్‌బీఓలు, ఏబీఓలు పాల్గొన్నారు.

ఆదివాసీలకు సరకులు అందజేసేందుకు కృషి

రాజవొమ్మంగి: మండలంలోని లోదొడ్డి పంచాయతీలోని కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీలకు (కోదు సామాజిక వర్గానికి) చౌక డిపో ద్వారా సరకులు అందజేసేందుకు కృషి చేస్తున్నట్టు స్థానిక జీసీసీ మేనేజర్ విజయలక్ష్మి తెలిపారు. ఆమె బుధవారం ఆ గ్రామ సమీపానికి వెళ్లి ఆదివాసీ గ్రామాలకు వెళ్లే మార్గాన్ని సర్పంచ్ లోతా రామారావుతో పరిశీలించారు. కొండపై 20 రేషన్ కార్డులకు చెందిన ఆదివాసీ కుటుంబాలు ఉన్నాయని, దాదాపు మూడు కిలోమీటర్ల దూరంలో నివసిస్తున్న గిరిజనులకు రేషన్ సరకులు అందడం లేదని, లోదొడ్డిలోని చౌక డిపో ద్వారా పొందుతున్నారని, సమస్య పరిష్కరించాలని ఇటీవల రాజవొమ్మంగి వచ్చిన జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణికి స్థానికులు కోరారు. ఈ మేరుకు జీసీసీ డీఎం, ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించామని జీసీసీ మేనేజర్ విజయలక్ష్మి చెప్పారు. నివేదికను జీసీసీ చైర్‌పర్సన్, డీఎంలకు అందజేస్తామన్నారు.


కిందంగి వెళ్లే అటవీ మార్గాన్ని పరిశీలిస్తున్న జీసీసీ మేనేజర్ విజయలక్ష్మి, సర్పంచ్ రామారావు

'ముసురుమిల్లి' నీరు విడుదల

దేవీపట్నం: ముసురుమిల్లి కెనాల్ ద్వారా ఖరీఫ్ ఆయకట్టుకు సాగునీరును ఎంపీపీ కుంజం మురళి బుధవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ కందుల బాబ్జి, జెడ్పీటీసీ శిరసం పెద్దబ్బులు హాజరయ్యారు. పంట కాలువలోకి 200 క్యూసెక్కుల సాగునీరును విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ముసురుమిల్లి ప్రాజెక్ట్ అధికారులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

ఇద్దరు అరెస్టు, వ్యాన్ సీజ్

పెదబయలు: మండలంలోని సీతగుంట జంక్షన్‌లో బుధవారం వ్యాన్‌లో తరలిస్తున్న 180 కిలోల గంజాయిని పట్టుకున్నట్టు సీఐ సత్యనారాయణ, ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ముంచంగిపుట్టు మండలం కుమడ నుంచి వస్తున్న వ్యాన్‌ను సీతగుంట జంక్షన్‌లో ఆపి తనిఖీ చేసినట్టు చెప్పారు. ఈ క్రమంలో నలుగురు వ్యక్తుల్లో ఇద్దరు తప్పించుకున్నారని తెలిపారు. వాహనంలో ఆరు బస్తాల్లో ఉన్న 180 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, వ్యాన్ సీజ్ చేసినట్టు చెప్పారు. ఒడిశా రాష్ట్రం కొరాపుట్టు జిల్లా పొట్టంగి మండలం గట్టిగుడ గ్రామానికి చెందిన రాజేంద్ర కర్ర, పెదబయలు మండలం లింగేటి పంచాయతీ దొండగరువు గ్రామానికి చెందిన వంతాల అప్పారావు అనే ఇద్దరిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.2.70 లక్షలు ఉంటుందని, పరారైన ఇద్దరు నిందితులను త్వరలో పట్టుకుంటామని సీఐ, ఎస్ఐ చెప్పారు. వీఆర్వో ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి నేటి నుంచి కౌన్సెలింగ్

కంచరపాలెం: జిల్లాలోని 3 ప్రభుత్వ, 29 ప్రైవేటు ఐటీఐల్లో మిగుల సీట్ల భర్తీకి ఈ నెల 3, 4 తేదీల్లో కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. ఆన్‌లైన్‌లో 2,908 మంది దరఖాస్తు చేసుకోగా 2,544 మంది మాత్రమే సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకుని కౌన్సెలింగ్‌కు అర్హత సాధించారని పేర్కొన్నారు. అభ్యర్థుల ఫోన్‌కు సమాచారం పంపించినట్లు తెలిపారు. గురువారం 1 నుంచి 1069 ర్యాంకు వరకు, శుక్రవారం 1070 నుంచి 2,544 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

ఆరోగ్యంలో పౌష్టికాహారం కీలకం

డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

చింతూరు: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంలో పౌష్టికాహారం ఎంతో కీలకమని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా అన్నారు. బుధవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోం రేషన్ పంపిణీ కార్యక్రమం జరిగింది. దీనిలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ముందుచూపుతో పోషక విలువలు కలిగిన పోషకాహార కిట్లను అందజేస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు దూరంగా నివసిస్తున్న గర్భిణులు, బాలింతలకు ఈ కిట్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చుడి మురళి, ఎంపీపీ సవలం అమల మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయలేని విధంగా ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకోసం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి, గైనకాలజిస్ట్ శశికళాదేవి, సీడీపీవో విజయగౌరి, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి పాల్గొన్నారు.


టేక్ హోం రేషన్ కిట్‌ను అందజేస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, ప్రజా ప్రతినిధులు

గ్రామాల్లో పింఛన్ల పంపిణీ

హుకుంపేట: మండలంలోని గ్రామ వలంటీర్లు ప్రభుత్వం నియమించిన విధులకు మించి పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను సక్రమంగా అందజేస్తున్నారు. మండల వ్యాప్తంగా బుధవారం భారీగా వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా గ్రామవలంటీర్లు ఉదయాన్నే లబ్ధిదారుల ఇంటి తలుపులు తట్టి పింఛన్ సొమ్మును అందజేశారు. దీంతో అవ్వా, తాతలు ఆనందం వ్యక్తం చేశారు. రెండవ రోజు పింఛన్ పంపిణీ 75% పూర్తయి, జిల్లాలో హుకుంపేట మండలం రెండవ స్థానంలో నిలిచిననట్టు ఎంపీడీవో వెంకటరావు చెప్పారు.


కోడెలిలో ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ అందజేస్తున్న గ్రామ వలంటీర్ కొండబాబు

'ప్రకృతి' ప్రోత్సాహం

- దళిత రైతులకు ప్రకృతి సేద్యంలో అండ
- అనకాపల్లిలో 301 మంది గుర్తింపు
- రూ.10 వేల విలువైన కిట్ల పంపిణీ

ప్రజల ఆరోగ్యం పట్ల సీఎం జగన్ నేతృత్వంలోని ప్రభుత్వ దృక్పథం మారింది. వ్యవసాయాన్ని ప్రకృతి సేద్యం వైపు తీసుకెళ్లేలా ప్రోత్సహిస్తోంది. ప్రకృతి సేద్యానికి వీలుగా దళిత రైతులకు అదనపు సాయం అందిస్తోంది. రూ.10 వేలు విలువైన సామగ్రి, 23 రకాల విత్తనాలను ఉచితంగా పంపిణీ చేస్తోంది. దీంతో రసాయనాలు, పురుగు మందుల్లేని పంట ఉత్పత్తులకు దోహదపడుతోంది.

సాక్షి,అనకాపల్లి: ప్రకృతి వ్యవసాయంలో రాణించేలా దళిత రైతులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. రూ.10 వేల విలువైన మెటీరియల్, 23 రకాల విత్తనాలను ఉచితంగా అందిస్తోంది. ఇందులో భాగంగా విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో 573 మంది ఎస్సీ రైతులను గుర్తించారు. వీరిలో అనకాపల్లి జిల్లాలో 301 మంది, విశాఖ జిల్లాలో 272 మంది ఉన్నారు. వీరికి మొత్తం రూ.57.30 లక్షల విలువైన ప్రకృతి వ్యవసాయ కిట్లను అందిస్తున్నారు. ఇప్పటికే అనకాపల్లి జిల్లాలో సుమారు 100 మందికి కిట్లు అందించారు.

కిట్‌లో ఉండే సామగ్రి

ప్రకృతి వ్యవసాయం చేసేందుకు వీలుగా ప్రభుత్వం గుర్తించిన దళిత రైతులకు రూ.10 వేల విలువకు సంబంధించి 8 పారముస్ట్రోల్స్, 30 స్టిక్కింగ్ ప్లాట్స్, ఒక టార్పాలిన్, 200 లీటర్ల డ్రమ్ము ఒకటి, 100 డ్రమ్ములు రెండు అందించనున్నారు. కిచెన్ గార్డెన్, సీడ్ టు సీడ్, ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్స్(పీఎండీఎస్)కు సంబంధించి 23 రకాల విత్తనాలను అందిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా జొన్న, మొక్కజొన్న, జీలుగ, పిల్లిపెసర, జనుము, కొర్ర, రాగులు, సజ్జలు, వేరుశనగ, నువ్వులు, మినుములు, పెసలు, కందులు, ఉలవలు తదితర పంటలతో పాటు కిచెన్ గార్డెన్‌లో భాగంగా పలు రకాల ఆకుకూరలు, కూరగాయలకు సంబంధించిన విత్తనాలను అందిస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఎన్నో లాభాలు

ప్రకృతి వ్యవసాయంతో అనేక లాభాలు ఉన్నాయి. రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులను వాడకుండా, గో ఆధారిత ఎరువులు, వేప సంబంధిత ఉత్పత్తులు, కషాయాలతో నాణ్యమైన పంటలను పండించవచ్చు. పెట్టుబడి ఖర్చు తక్కువగా ఉండటంతో రైతుకు నికరాదాయం పెరుగుతుంది. వాతావరణ కాలుష్యం తగ్గి, రసాయన అవశేషాలు లేని ఆహార పంటల ఉత్పత్తి జరుగుతుంది. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. దీంతో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోంది.


దళిత రైతులకు అందించే ప్రకృతి వ్యవసాయ కిట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర ఎస్సీ(రెల్లి) కార్పొరేషన్ చైర్మన్ మధుసూదనరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామారావు(ఫైల్)